## క్లుప్తంగా

### బాధ్యతల స్వీకారం


సూపర్‌వైజర్ శిరీష

రొంపిచెర్ల: రొంపిచెర్ల ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌గా శిరీష గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న భారతిని అన్నమయ్య జిల్లా పీలేరుకు బదిలీ చేశారు. పులిచెర్ల పనిచేస్తున్న శిరీషను రొంపిచెర్లకు బదిలీ చేస్తూ పీడీ నాగశైలజ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు బాగా పని చేసి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. పాలు, కోడి గుడ్లు, పౌష్టికాహారం పంపిణీలో నిర్లక్ష్యం చూపకూడదని తెలిపారు. పిల్లలకు ఆట పాటలతో ఇంగ్లిషు విద్య బోధించాలన్నారు.

### 11న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

రొంపిచెర్ల: రొంపిచెర్ల ఆదర్శ పాఠశాలలో ఈనెల 11న 6వ తరగతి ప్రవేశ పరీక్ష జరుగుతుందని ప్రిన్సిపాల్ సరళ గురువారం తెలిపారు. 6వ తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఇంటర్‌నెట్‌లో హాల్ టికెట్లును డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. 11వ తేదీ ఉదయం 8.30 గంటలకు పాఠశాలకు చేరుకోవాలని తెలిపారు. పరీక్ష రెండు గంటల సేపు ఉంటుందన్నారు. పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు. తల్లిదండ్రులు వివరాల కోసం ఆదర్శ పాఠశాలను సందర్శించవచ్చని సూచించారు.

**పెన్ను, ప్యాడ్ తెచ్చుకోవాలి**

పుంగనూరు: మండలంలోని అడవినాథునికుంట మోడల్‌స్కూల్‌లో ఆరో తరగతి ప్రవేశాలకు ఈనెల 11న ఎంట్రన్స్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రమ తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ ఉదయం 8.30 గంటలకు విద్యార్థులు కేంద్రానికి హాజరుకావాలన్నారు. నీలం లేదా నలుపు రంగు పెన్ను, ప్యాడ్ వెంట తెచ్చుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు నెట్‌లో హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

### హెచ్‌ఎంకు సన్మానం


సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదేళ్లుగా ప్రధానోపాధ్యాయుడుగా పనిచేస్తున్న పోకల తాతయ్య గురువారం రొంపిచెర్ల బాలుర హైస్కూల్‌కు బదిలీ అయ్యారు. ఈసందర్భంగా ఉపాధ్యాయ బృందం ఆయనకు వీడ్కోలు సన్మానం చేశారు. భాకరాపేటలో హైస్కూల్ హెచ్‌ఎం శ్రీవాణి ఇక్కడికి రానున్నారు.

**బాధ్యతల స్వీకారం**

రొంపిచెర్ల: రొంపిచెర్ల బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పోకల తాతయ్య గురువారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న హెచ్‌ఎం శ్రీరాములు అన్నమయ్య జిల్లా పీలేరు ఉర్దూ ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు.

### యోగాతో జ్ఞాపకశక్తి


యోగా నేర్పుతున్న గురువు నందగోపాల్

పలమనేరు: యోగాతో జ్ఞాపకశక్తి పెరుగుతుందని యోగా గురువు నందగోపాల్ సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థుల వేసవి శిబిరంలో భాగంగా గురువారం యోగా శిక్షణ ఇచ్చారు. పిల్లలచే ఆయన యోగసనాలను వేయించారు. చిన్నతనం నుంచి యోగా చేస్తూ పుస్తక పఠనాన్ని అలవరుచుకుంటే మానసికంగా ధృడంగా తయారు కావచ్చని సూచించారు. యోగాతో ఏకాగ్రత పెరుగుతుందని పేర్కొన్నారు. గ్రంథాలయాధికారి హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

### గడ్డివామి దగ్ధం

గంగవరం: మండలంలోని కల్లుపల్లెలో గురువారం జరిగిన అగ్నిప్రమాదంలో పాడి రైతు శంకరప్పకు చెందిన గడ్డివామి దగ్ధమైంది. ఇంటి ముందు నిల్వ చేసి ఉన్న గడ్డివామికి ప్రమాదవశాత్తు నిప్పంటుకుని మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు అతి కష్టంపై మంటలను అదుపులోకి తెచ్చారు. రూ. 20 వేలు విలువ చేసే గడ్డివామి దగ్ధమైనట్టు బాధిత రైతు వాపోయాడు.

### ఆర్టీసీ డీఎంగా పెంచులయ్య


సన్మానిస్తున్న కార్మిక సంఘం నాయకులు

కుప్పం: కుప్పం ఆర్టీసీ డిపో మేనేజర్‌గా పెంచులయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న స్వామి చిత్తూరు బదలీ అయ్యారు. బాధ్యతలను స్వీకరించిన పెంచులయ్యను ఎస్‌ఎంయూ కార్మిక సంఘ నాయులు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఎస్‌ఎంయూ నాయకులు జయపాల్, మణి, ప్రసాద్ కుమార్, మునెప్ప తదితరులు పాల్గొన్నారు.

# మహిళల భద్రతకు పెద్దపీట

చౌడేపల్లె : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఊహించని రీతిలో భద్రత కోసం ప్రధానంగా మహిళ రక్షణకు పెద్దపీట వేసినట్లు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. చౌడేపల్లె–పుంగనూరు మార్గంలోని దొరబావితోట సమీపంలో నూతనంగా రూ.1.60 కోట్ల నిధులతో నిర్మించిన రూరల్ సర్కిల్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్ భవనాలను మంత్రి పెద్దిరెడ్డి గురువారం ప్రారంభించారు. పోలీసుల గౌరవవందనం స్వీకరించారు. మంత్రి మాట్లాడుతూ దిశ చట్టం మహిళల భద్రత కోసం ఏర్పాటు చేసిందేనని పేర్కొన్నారు. ఈ చట్టం కింద ఆపదలో ఉన్న వారిని క్షణాల్లో పోలీసులు ఆదుకుంటున్నారని తెలిపారు.

**శాశ్వత భవనానికి మంత్రి చొరవ**

అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి మాట్లాడుతూ కొన్నేళ్లుగా ఇరుకైన అద్దె భవనంలోని కార్యాలయంలో పోలీసు సిబ్బంది పడుతున్న అవస్థలను మంత్రి పెద్దిరెడ్డి గుర్తించి ప్రత్యేక చొరవ తీసుకుని శాశ్వత భవన ఏర్పాటుకు కృషి చేయడం అభినందనీయమని కొనియాడారు. చిత్తూరు జిల్లాలోనే ఆదర్శంగా సర్కిల్ కార్యాలయం, పోలీస్ స్టేషన్ భవనాన్ని నిర్మించారని తెలిపారు. శాంతిభద్రల పరిరక్షణలో ప్రజలు మెచ్చుకునే విధంగా పోలీసులు పని చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని సూచించారు.

**స్థల దాతలకు సన్మానం**

సర్కిల్ కార్యాలయం, పోలీస్ స్టేషన్ భవనం నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఇచ్చిన దాతలు డాక్టర్ మురళీ నాయుడు, ఎస్.దామోదరరాజును మంత్రి పెద్దిరెడ్డి సన్మానించారు. గడువులోపు నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులు పూర్తి చేయించిన జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, కాంట్రాక్టర్ డీఎస్.పవన్‌కుమార్‌ను మంత్రి, డీఐజీ సత్కరించారు. చిత్తూరు ఎంపీ ఎన్.రెడ్డెప్ప, టీటీడీ బోర్డు మెంబరు పోకల అశోక్‌కుమార్, కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ రిషాంత్‌రెడ్డి, అడిషినల్ ఎస్పీలు శ్రీలక్ష్మి, సుధాకర్, సీఐ మధుసూదనరెడ్డి, ఎస్‌ఐ రవికుమార్ పాల్గొన్నారు.


చౌడేపల్లెలో సర్కిల్ కార్యాలయం, పోలీస్ స్టేషన్ భవనాలను ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, పక్కన కలెక్టర్ షణ్మోహన్

**ఆపన్నులకు అండగా సీఎం**

సదుం: ఆపన్నులకు అండగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలుస్తున్నారని, వారి ఇంట్లో కుటుంబ సభ్యుడిలా వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో గురువారం లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. మారుతివారిపల్లెకు చెందిన చినపాపకు రూ.1.50 లక్షలు, తిమ్మానాయనపల్లెకు చెందిన అమరావతమ్మకు రూ.1.70 లక్షలు, జంగంపల్లెకు చెందిన నాగరాజుకు రూ.38 వేలు, బయ్యారెడ్డిగారిపల్లెకు చెందిన చలపతికి రూ.35 వేల చెక్కును ఆయన అందజేశారు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, సర్పంచ్ ఉషారాణి, సింగిల్ విండో చైర్మన్ తిమ్మారెడ్డి, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ధనుంజయరెడ్డి పాల్గొన్నారు.


స్థల దాత దామోదరరాజుకు సన్మానం

### పేదల సంక్షేమమే ధ్యేయం

చౌడేపల్లె: పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని లద్దిగం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం, మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎంపీ రెడ్డెప్పతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలో వచ్చినప్పటి నుంచి సంక్షేమ పాలన సాగుతోందని తెలిపారు. గ్రామాల్లో పేదలకు ఇంటి వద్దకే వైద్య సేవలందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కులమతాలకతీతంగా పథకాలను వలంటీర్, సచివాలయ వ్యవస్థల ద్వారా పారదర్శకంగా లబ్ధి చేకూర్చుతూ గ్రామ స్వరాజ్యం దిశగా పనిచేస్తున్నట్లు తెలిపారు. తాగునీటి కోసం జల జీవన్ మిషన్ కింద ప్రతి ఇంటింటికీ కొళాయి ఏర్పాటు చేస్తున్నామన్నారు. రూ.5 లక్షల వ్యయంతో లద్దిగంలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వైద్యం కోసం మారుమూల పల్లెల నుంచి పట్టణాలకు వెళ్లకుండా పీహెచ్‌సీని అనుసంధానిస్తూ ఉపకేంద్రంను ఏర్పాటు చేసి, నాణ్యమైన వైద్య సేవలందిచేలా ప్రత్యేక సిబ్బందిని కేటాయించినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ షణ్మోహన్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, వైస్ ఎంపీపీలు సుధాకర్ రెడ్డి, నరసింహులు యాదవ్, మాజీ ఎంపీపీలు అంజిబాబు, రుక్మిణమ్మ, సింగిల్‌విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ కల్యాణ్ భరత్, సర్పంచ్ కృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు జ్యోతమ్మ తదితరులు పాల్గొన్నారు.


లద్దిగంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

### నేడు గడప గడపకు

పెద్దపంజాణి: మండలంలోని పెద్దకాప్పల్లె సచివాలయ పరిధిలో శుక్ర, శనివారాలు ఎమ్మెల్యే డాక్టర్ వెంకటేగౌడ గడపకు గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బాగారెడ్డి తెలిపారు. శుక్రవారం తిప్పిరెడ్డిపల్లె, ఎస్టీ కాలనీ, కొత్త బూరగపల్లె, పెనుగొలకల, పెద్దకాప్పల్లె, ముదిరెడ్డిపల్లెలో, శనివారం బందార్లపల్లె, జిట్టంవారిపల్లె, గౌరీనగర్, ఆకులవారిపల్లె, బేరుపల్లెలో ఎమ్మెల్యే పర్యటిస్తారని వివరించారు. ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

### ఘనంగా కుంభాభిషేకం



వి.కోట: మండలంలోని కృష్ణాపురం పంచాయతీ కుమ్మరమడుగు సమీపంలో వెలసిన ముష్టూరు గంగమ్మదేవి ఆలయ కుంభాభిషేకం పూజలు గురువారం వైభవంగా జరిగాయి. ఎంపీపీ యువరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. సర్పంచ్ సుభాష్, ఎంపీటీసీ సభ్యుడు మురుగేష్ తదితరులు పాల్గొన్నారు.

### 12న వలంటీర్లకు సత్కారం

శాంతిపురం: ఈనెల 12వ తేదీన మండలంలో ఉత్తమ సేవలు అందించిన గ్రామ వలంటీర్ల సత్కారం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో హేమమాలిని తెలిపారు. చౌడంపల్లె క్రాస్‌లోని మండల హార్టీకల్చర్ హబ్‌లో కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ల డైరెక్టర్లు పాల్గొంటారని తెలిపారు.

## నాలుగు దశాబ్దాల సమస్య పరిష్కారం

- గడప గడపలో తక్షణం స్పందించిన ఎమ్మెల్యే వెంకటేగౌడ
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

పలమనేరు/పెద్దపంజాణి: పెద్దపంజాణి మండలం రాయలపేట చిన్నపీర్లమఠం వీధిలో నలభై ఏళ్లుగా నెలకొన్న మురుగునీటి సమస్య తీరింది. అక్కడ డ్రైన్ నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి కావడంతో ఆప్రాంత వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాయలపేట గ్రామంలో ఈ ప్రాంతం తగ్గులో ఉంటుంది. గ్రామంలోని మురుగునీరు మొత్తం ఈ వీధిలో నిల్వ ఉంటుంది. ఈ సమస్యను పరిష్కరించాలని అక్కడి ప్రజలు గత ప్రభుత్వంలో అధికారులకు పలుమార్లు విన్నవించినా లాభం లేకుండా పోయింది. ఇటీవల గ్రామంలో గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంకటేగౌడకు అక్కడి ప్రజలు కాలువ ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దుర్గంధంతో దోమల బెడతో రోగాలు వ్యాప్తి చెందుతున్నాయని, ప్రధానంగా భోజనం కూడా చేయలేని పరిస్థితి ఉందన్నారు. దీనిపై తీవ్రంగా స్పందించిన ఎమ్మెల్యే అక్కడికక్కడే ఎమ్మెల్యే సచివాలయ నిధులు రూ.6.50 లక్షలను మంజూరు చేశారు. దీంతో 180 మీటర్ల మేర కాలువ పనులను స్థానిక కాంట్రాక్టర్ సుహేబ్ త్వరితగతిన పూర్తిచేశారు. మరుగునీటిని కాలువ ద్వారా కింది ప్రాంతానికి మళ్లించారు. నాలుగు దశాబ్దాల సమస్య తీరడంతో ఆ ప్రాంత వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


రాయలపేట చిన్నపీర్లమఠం వీధిలో కాలువ నిర్మాణం

### ఎంపీపీ ఎన్నిక వాయిదా

రామకుప్పం: ఎంపీపీ, 2వ వైస్ ఎంపీపీ ఎన్నికకు గురువారం నిర్వహించిన ఎన్నికలకు ఎంపీటీసీ సభ్యులు గైర్హాజరు కావడంతో వాయిదా పడింది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గురువారం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో అధికారులు ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. ఎంపీడీఓ రాధాకృష్ణ, ఎస్‌ఐ కృష్ణయ్య విస్తృత ఏర్పాట్లు చేశారు. కానీ మొత్తం 15 మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా, ఎవరూ హాజరు కాలేదు. సభ్యుల గైర్హాజరుపై ఉన్నత అధికారులకు నివేదిక పంపుతున్నట్టు ఎన్నికల అధికారి పురుషోత్తం తెలిపారు. ఎంపీపీ శాంతకుమారి అనారోగ్యంతో మృతి చెందడంతో వైస్ ఎంపీపీ సుబ్రమణ్యం ఆమె స్థానంలో బాధ్యతలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే.


ఎంపీటీసీ సభ్యుల గైర్హాజర్‌తో ఖాళీగా ఉన్న కుర్చీలు

### వైభవంగా ముగిసిన జాతర


అమ్మవారి ఊరేగింపు

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేట గ్రామంలో శ్రీపటాలమ్మ జాతరలో రెండో రోజు గురువారం జలది కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రతిమను ఊరేగింపుగా తీసుకెళ్లి తీసుకెళ్లి జలది చేశారు. భక్తులు అడుగడుగునా కొబ్బరికాయలు కొట్టి కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

### హెచ్‌ఎం బాధ్యతల స్వీకరణ


మారెళ్ల భాస్కర్

పెద్దపంజాణి: చిన్నేపల్లె ఉర్దూ ఉన్నత పాఠశాల హెచ్ ఎంగా మారెళ్ల భాస్కర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. వి.కోట మండలం నక్కనపల్లె నుంచి ఆయన ఇక్కడికి బదిలీ అయ్యారు. ఎస్టీయూ జిల్లా, మండల నాయకులు ఆయనను కలసి శుభాకాంక్షలు తెలిపారు.

## ఖాతాలకు వైఎస్సార్ ఆసరా జమ

గుడుపల్లె: మండలంలోని సోడిగానిపల్లె పంచాయతీలోని ప్రజా వెలుగు గ్రామైక్య మహిళ సభ్యులకు వైఎస్సార్ ఆసరాను సంఘాల నుంచి సభ్యుల ఖాతాల్లోకి జమ చేశారు. మొత్తం 42 సంఘాల్లోని 430 మంది సభ్యులకు రూ.52,19,780 జమ చేశారు. ఈ ఆసరా నిధులను మహిళలు పాడి ఆవులు, చిన్న చిన్న పరిశ్రమల ద్వారా అభివృద్ధి చెందాలని ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి కోరారు. ఏపీఎం శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ నాయకులు నారాయణస్వామి, రంగప్ప సీసీ వెంకటస్వామి, సంఘమిత్ర లక్ష్మీపతి పాల్గొన్నారు.


జమ చేసిన పత్రాల అందజేత

### ఉపాధి పనుల పరిశీలన

పులిచెర్ల(కల్లూరు): మండలంలో వివిధ గ్రామాల్లో ఉపాధి పథకంలో జరుగుతున్న పనులను గురువారం ప్రాజెక్ట్ డైరెక్టర్ గంగా భవాని పరిశీలించారు. బోడిరెడ్డి గారిపల్లె పంచాయతీలో మామిడి మొక్కల పెంపకం, పాత పేటలో సెరీకల్చర్, మతుకు వారి పల్లె ఫీడర్ చానల్ పనులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రైతులకు ఉపయోగ పడే పనులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కూలీలకు పనిదినాలను పెంచాలని సిబ్బందికి సూచించారు. ఏపీఓ సౌకత్‌అలీ, జేఈ కృష్ణ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.


మామిడి మొక్కల పెంపకాన్ని పరిశీలిస్తున్న పీడీ గంగాభవాని

### లార్వాల కట్టడిపై శిక్షణ

పలమనేరు: మలేరియాకు కారణమైన లార్వాల కట్టడిపై మున్సిపల్ హెల్త్ సెక్రటరీలకు గురువారం శిక్షణ ఇచ్చారు. మున్సిపల్ కార్యాలయ సమావేశ హాలులో జరిగిన ఈకార్యక్రమానికి జిల్లా మలేరియా నివారణ అధికారి శ్రీనివాసులు హాజరై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. లార్వా వ్యాప్తికి కారణాలు, దాని ఉనికిని ఎలా కట్టడి చేయాలి, ఫాగింగ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అబేట్, పైరిత్రం వాడకంలో డోసేజీలు తదితరాలను వివరించారు. సబ్‌యూనిట్ అధికారి జయశంకర్, శానిటరీ అధికారి రమణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మలేరియా నివారణాధికారి శ్రీనివాసులు

# బడి బాధలకు ఇక బైబై


విద్యార్థుల పంపిణీకి సిద్ధం చేస్తున్న నాణ్యమైన స్కూల్ బ్యాగులు


పంపిణీకి సిద్ధంగా పాఠ్యపుస్తకాలు

**పలమనేరు మండలంలో ..**

| | |
|---|---|
| ప్రాథమిక పాఠశాలలు | 58 |
| మొత్తం విద్యార్థులు | 3,175 |
| ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలు | 11 |
| ఇందులో విద్యార్థులు | 3,998 |
| వచ్చిన మొత్తం బ్యాగులు | 7170 |
| బెల్టులు | 4,907 |
| షూలు, సాక్స్‌లు | 12,966 |
| యూనిఫామ్స్ | 7,170 |
| నోట్ పుస్తకాలు | 46,105 |
| అచ్చు పుస్తకాలు | 63,834 |
| ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు | 1376 |

గత టీడీపీ ప్రభుత్వంలో జూన్ నెల వచ్చిందంటే తల్లిదండ్రులుకు భయం తప్పేది కాదు. పిల్లల పాఠ్య పుస్తకాలు, నోట్సులు, బ్యాగు, షూల కోసం అప్పోసప్పో చేయాల్సిన పరిస్థితి. ఇప్పుడలా కాదు నేటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేసింది. చదువుతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని భావించింది. జగనన్న విద్యా కానుకతో ఏడు రకాల వస్తువులను బడులు తెరుచుకోకముందే అన్ని పాఠశాలలకు పంపింది. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తమకు ఏ దిగులు లేకుండా పోయిందని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- గతంలో తల్లిదండ్రులకు తప్పని కష్టాలు
- నేడు జగనన్న విద్యాకానుకతో అన్నీ ఉచితం
- పేద పిల్లలకు విద్యను ఇష్టంలా మార్చిన సర్కార్
- పునఃప్రారంభానికి ముందే విద్యాసామగ్రి బడులకు
- నాడు–నేడుతో ప్రైవేటుకు దీటుగా సర్కార్ స్కూళ్లు

పలమనేరు : ప్రభుత్వ బడులు కార్పొరేట్‌ను తలదన్నేలా మారాయి. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పేందుకే మొగ్గుచూపుతున్నారు. గత మూడేళ్లలో ఏటా సర్కారు బడుల్లో పెరుగుతున్న అడ్మిషన్లు, ఫలితాలే ఇందుకు సాక్ష్యం. కార్పొరేట్ పాఠశాలలు ఎన్ని ప్రచారాలు చేస్తున్నా అక్కడ కంటే ప్రభుత్వ బడుల్లోనే పిల్లల నమోదు శాతం పెరుగుతోంది. గతంలో సర్కారు బడులంటే చిన్నచూపుండేది. తల్లిదండ్రులు అప్పులు చేసి సైతం పిల్లలను ప్రైవేటు స్కూళ్లల్లో చేర్పేవారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక విద్యారంగానికి పెద్దపీట వేశారు. చదువుతోనే సమాజం బాగుపడుతుందని భావించారు. నాడు నేడు ద్వారా ప్రభుత్వ బడుల రూపురేఖలను మార్చేచారు. పిల్లల చదవు తల్లిదండ్రులకు కష్టం కారాదని, చదవుకు పేదరికం అడ్డంకి కాకూడదని అమ్మఒడి ద్వారా తల్లుల ఖాతాల్లోకి నగదు బదిలీ చేపట్టారు. మధ్యాహ్నం పిల్లలకు పౌష్టికాహారం అమలు చేస్తున్నారు. ముఖ్యంగా వేసవి సెలవుల అనంతరం పాఠశాలల పునః ప్రారంభం రోజునే జగనన్న విద్యా కానుక కింద ఏడు రకాల వస్తువులను విద్యార్థులకు పంపిణీ అయ్యేలా చర్యలు తీసుకుంటుండడం సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. సర్కారు బడుల్లో చేర్పడం తల్లిదండ్రులు గౌరవంగా భావిస్తున్నారు.

**గతంలో జూన్ ఫీవర్**

గత టీడీపీ పాలనలో స్కూళ్లు తెరుస్తున్నారంటే తల్లిదండ్రులుకు భయం తప్పేదికాదు. యూనిఫామ్, పాదరక్షలు, బెల్టు, నోటు పుస్తకాలు, పెన్నులు, అచ్చుపుస్తకాలు, స్కూల్‌బ్యాగు ఇలా విద్యాసామాగ్రికి ఎంతలేదన్నా పదివేలు వెచ్చించాల్సి వచ్చేది. పేద, మధ్యతరగతికి చెందిన వీటికోసం అప్పులు చేసేవారు. ప్రైవేటు స్కూళ్లలో యాజమాన్యం విద్యాసామగ్రిని అందజేస్తూ రెట్టింపు మొత్తాన్ని వసూలు చేసేది. ఈ కష్టాలను గమనించిన జగనన్న సర్కార్ తల్లిదండ్రులకు పిల్లల చదువు భారం కాకూడదని ఏడు రకాల వస్తువుల కిట్‌ను బడులు తెవరకముందే పంపిణీ చేస్తోంది.

**బడులు తెరుస్తారనే భయం లేదు**



గతంలో బడి తెరుస్తారంటే పిల్లలకు యూనిఫామ్, పుస్తకాలు, బ్యాగు ఇలా ప్రతిదానికి ఇబ్బందులు తప్పేవికాదు. నేడు సీఎం జగనన్న పుణ్యాన మాకు ఎలాంటి బెంగ లేదు. అన్నిరకాల విద్యాసామాగ్రి ఠంచనుగా అందుతోంది. దీంతోపాటు అమ్మఒడి, మధ్యాహ్న భోజనం తదితరాలతో మాలాంటి పేదవారికి ఆనందం మరేమైనా ఉంటుందా. మా పిల్లల భవిష్యత్తుకోసం ఇంతలా కృషిచేస్తున్న ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదు.

– సుష్మిత, విద్యార్థి తల్లి, పలమనేరు

**జగనన్న విద్యాకానుకలు సిద్ధం**



మండలంలోని 69 బడులకు సంబంధించి ఏడు రకాల జగన్న విద్యాకానులకు ఇప్పటికే అందా యి. వీటిని పాఠశాలల వారీగా వేరుచేసి పంపే చర్యలు ప్రారంభించాం. బడులు పునఃప్రారంభానికి ముందే ప్రభుత్వం అన్ని ఐటెంలను పంపించింది. ఇక ఏ ఇబ్బంది లేకుండా పిల్లలకు అందినట్టే. ప్రభుత్వ బడుల విద్యార్థుల కోసం ఏ ప్రభుత్వం ఇంతటి శ్రద్ధ చూపలేదు. అందుకే సర్కారు బడులంటే ఇప్పుడు సమాజంలో గౌరవం పెరిగింది.

– లీలారాణి, ఎంఈఓ, పలమనేరు

### పలమనేరు ఎఫ్‌ఆర్‌ఓగా శివన్న



పలమనేరు : పలమనేరు ఎఫ్‌ఆర్వోగా శివన్న గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న నయూమ్‌అలీ కడప స్క్వాడ్ డీఎఫ్వోగా బదిలీ అయ్యారు. బాధ్యతల స్వీకరించిన అనంతరం శివన్న మాట్లాడుతూ ఈ ప్రాంతంలో గతంలో పనిచేసిన అనుభవం ఉండడంతో ముఖ్యంగా ఏనుగుల సమస్యపై దృష్టి సారించనున్నట్టు తెలిపారు. తనకు అన్ని విధాల సహకరించిన అధికారులకు నయీమ్‌అలీ కృతజ్ఞతలు తెలిపారు.

### గజ దాడుల నష్టం వివరాల సేకరణ


కల్లూరులో వివరాలను సేకరిస్తున్న సంతోషికుమారి

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు, పాతపేట, పరిసర ప్రాంతాల్లో ఏనుగులు దాడిలో నష్టపోయిన పంటల వివరాలను గురువారం సేకరించారు. మామిడి, వరి, చెరకు పంటలపై విరుచుకపడి ఏనుగులు ధ్వంసం చేశాయి. ఉద్యాన వన శాఖాధికారి సంతోషి కుమారి కల్లూరు సచివాలయంలో పంట నష్ట పోయిన రైతుల నుంచి వివరాలను సేకరించారు. పూర్తి వివరాలతో ఉన్నతాధికారులకు నివేదికలు పంపిస్తామని ఆమె తెలిపారు.